సాక్షి
జగిత్యాల
సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



అంజన్నకు మొక్కులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని ఆదివారం సుమారు 5వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



శ్రావణ సందడి

వేములవాడఅర్బన్: నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణం సందర్భంగా ఆదివారం భక్తుల సందడి నెలకొంది.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటస్వామి

ధర్మపురి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ రమణామూర్తి ఆధ్వర్యంలో జరిగిన గణేశ్ మండప నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంటపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోరాదన్నారు. భక్తి పాటలు వేయాలని, డీజే సౌండ్ వినియోగించవద్దన్నారు. తక్కువ ఎత్తు విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. భారీ విగ్రహాలను రాయపట్నం వద్ద నిమజ్జనం చేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు వద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

జగిత్యాలటౌన్: సమస్యలతో కుంగిపోకుండా మొక్కవోని ధైర్యం, ఆశావహ దృక్పథంతో ఎదుర్కొంటే సత్ఫలితాలు వస్తాయని రైతు సంఘం నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. స్టూడెంట్స్ సూసైడ్స్ అండ్ క్రైం ఎరాడికేషన్ సొసైటీ (జేజేఎస్) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఆత్మహత్యల నిర్మూలన, అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుల్లో వెనుకబడ్డామని, ఫెయిల్ అయ్యామనే చిన్న కారణాలతో ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. జేజేఎస్ అధ్యక్షుడు భూమేశ్ మాట్లాడుతూ ప్రతీసమస్యకు ప్రకృతే పరిష్కారం చూపిస్తుందన్నారు. సైకాలజిస్టులు బి.రాజేందర్, విపవన్, జేజేఎస్ ఉపాధ్యక్షుడు హరీశ్, ప్రతినిధులు నాగేంద్రశర్మ, సాయికృష్ణ, నరేశ్, తవుటు రాంచంద్రం, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు తోట శివకుమార్, మహిపాల్, నరేశ్, జీవన్, తిరుపతి, గంగారాం, అంజయ్య పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

సారంగాపూర్(జగిత్యాల): జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత–సురేశ్ దంపతులు శ్రావణంలో ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీదుబ్బరాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలో పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లోని కేంద్ర మంత్రి కార్యాలయంలో మంత్రి ప్రభుత్వ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లా ప్రజలు ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్తున్నారని తెలిపారు. వీరికి పాస్‌పోర్టులు అవసరమని అన్నారు అయితే, పోస్టాఫీస్ కోసం ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఎకరం స్థలం కేటాయించిందని, ఇందులో పోస్టాఫీసుతోపాటు పాస్‌పోర్టు సేవాకేంద్రం ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, ఏసీఎస్ రాజు, అరవ లక్ష్మి, బుర్ర ప్రమోద్, సురేశ్, అశోక్, బిట్టూ తదితరులు పాల్గొన్నారు.

ఆశలు గల్లంతు!

- అధికారుల మార్గదర్శకాలు అంతంతే..
- లబ్ధిదారులకు కర్మాగారం ఏర్పాటుపై అవగాహన కరువు
- రూ.50లక్షల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు సాధ్యమేనా?
- ప్రశ్నలు లేవనెత్తుతున్న దళితబంధు 'స్పైసీ' యూనిట్ వ్యవహారం



దేశాయిపేటలో అసంపూర్తిగా మిగిలిన దళితబంధు స్పైసీ యూనిట్ షెడ్

కోరుట్ల/మేడిపల్లి: లాభదాయకమైన మిర్చి, పసుపు తయారీ పరిశ్రమ ఏర్పాటు యోచన బాగుంది.. కానీ, దాని స్థాపనకు అవసరమైన పెట్టుబడి.. నిర్వహణపై అవగాహన.. ఎదురయ్యే సవాళ్లు.. మార్కెట్ సౌకర్యం.. ఇలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడంతోనే చిక్కొచ్చిపడింది. పాత మేడిపల్లి మండలంలోని ఐదుగురు దళితబంధు లబ్ధిదారులు కలిసి.. కొందరు రాజకీయ నాయకుల మార్గదర్శనంలో స్పైసీ పరిశ్రమ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నారు.. సుమారు ఏడాదిన్నర గడిచినా కర్మాగారం పనులు పాతికశాతం కూడా పూర్తికాలేదు. ఇక యూనిట్ స్థాపన తమతో కాదని లబ్ధిదారుల్లో కొందరు ఇటీవల వెనక్కి తగ్గడం ప్రస్తుతం సమస్యగా మారింది.

ఆశలు అడియాసలు..?

- దళితబంధు స్పైసీ పరిశ్రమ ఏర్పాటులో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్న దేశాయిపేటకు చెందిన ముత్తునూరి గంగారాం(66) కూలీ పనులు చేస్తున్నాడు. పెద్దగా చదువురాదు.
- మన్నెగూడేనికి చెందిన మరో భాగస్వామి ఉమ్మడి రాకేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు నిరక్షరాస్యుడు.
- ఈదులలింగంపేటకు చెందిన ఎడ్ల రమేశ్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. మోటార్ సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.
- పసునూరుకు చెందిన దాసరి రాజేశ్ పేరిట దళితబంధు సాయం మంజూరైంది. అయితే, అతడు చనిపోవడంతో అతడి భార్య స్వప్నను జాబితాలో చేర్చారు.
- ఇక గోవిందారం గ్రామానికి చెందిన నెల్లుట్ల గంగు కూలీనాలీ చేసుకుని బతికే కుటుంబం.
- పేదలైన వీరి ఎంపిక ఆశించదగినదే అయినా.. సరైన ఉపాధి మార్గాలు చూపడంలో మార్గదర్శనం కరువైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- దళితబంధు యూనిట్లు మంజూరై ఏడాదిన్నర గడుస్తున్నా స్పైసీ కర్మాగారం పనుల్లో పెద్దగా పురోగతి లేకపోవడం దళితుల ఆశలకు గండిపడినట్టుయింది.
- గత శుక్రవారం స్పైసీ యూనిట్ లబ్ధిదారుల్లోని ముగ్గురు తమకు ఆ యూనిట్ వద్దంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయడంతో ప్రత్యామ్నాయం ఏమిటనే ప్రశ్న ప్రస్తుతం తలెత్తుతోంది.

అంచనాలు తప్పాయి..!

ఐదుగురు లబ్ధిదారులు కలిసి రూ.50 లక్షలు వెచ్చించి స్పైసీ యూనిట్ ఏర్పాటుకు యత్నించారు. ఈ సమయంలోనే అధికార యంత్రాంగం సాధ్యాసాధ్యాలపై ఒక అంచనాకు రాకపోవడం గమనార్హం. స్పైసీ యూనిట్ ఏర్పాటుకు కనీసం రూ.కోటికి మించి పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని సమాచారం. ప్రస్తుతం సగం వరకు నిర్మించిన షెడ్డు కోసమే రూ.29 లక్షలు వెచ్చించారని చెబుతున్నారు. ఈక్రమంలో మిగిలిన రూ.21 లక్షలతో విలువైన యంత్రసామగ్రి, మిర్చి, పసుపు ప్రాసెసింగ్ పరికరాలు ఎలా సమకూరుతాయన్న అంశం ప్రశ్నార్థకంగా మారింది. భవిష్యత్‌లో ఎంపికయ్యే దళితబంధు లబ్ధిదారులను ఈ యూనిట్‌లో భాగస్వాములుగా తీసుకునే అవకాశాలు అంతంత మాత్రమే. కేవలం రూ.50 లక్షల వ్యయంతో పరిశ్రమ ఎలా స్థాపిస్తారనే విషయంపై అధికార యంత్రాంగం లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్న వాదనలు వినవస్తున్నాయి.

ఒప్పందం మేరకే..

స్పైసీ పరిశ్రమ ఏర్పాటు చేసుకుంటామని దళితబంధు లబ్ధిదారులు ఒప్పందం చేసుకున్నారు. ఈమేరకు వారికి వివిధ అంశాలపై ఇప్పటికే అవగాహన కల్పించాం. ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమలను వారికి చూపించాం. ప్రస్తుతం స్పైసీ కర్మాగారం ప్రగతి దశలో ఉంది. లబ్ధిదారులకు రూ.29 లక్షలు విడుదల చేశాం. పనుల ప్రగతిపై ఇంజినీర్‌తో అంచనాలు వేయిస్తున్నాం. మిగిలిన రూ.21 లక్షలు వెచ్చించి పరిశ్రమ పనులు పూర్తిచేసుకోవాలి.

– వెంకటేశ్ జాదవ్, ఎంపీడీవో, మేడిపల్లి

నేతలు ఎందుకు వెళ్లారు?

నిజామాబాద్ జిల్లా అంక్సాపూర్, కోరుట్ల మండలం అయిలాపూర్ వంటి ఏరియాల్లోని స్పైసీ కర్మాగారాలపై అధ్యయనం చేసేందుకు లబ్ధిదారులు, అధికారులు కొందరు ఇటీవల అక్కడకు వెళ్లారు. వారితోపాటు కొందరు అధికార పార్టీ నాయకులు ఎందుకు వెళ్లారనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లబ్ధిదారులకు అవగాహన కల్పించి స్పైసీ పరిశ్రమ ఏర్పాటు చేసే విషయంలో సరైన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉండగా.. రాజకీయ నాయకులు ఎందుకు జోక్యం చేసుకున్నారని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ప్రశ్నిస్తున్నారు.

భూ సర్వేలో గందరగోళం

వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటకు చెందిన గడ్డం అనురాధకు 376 సర్వే నంబరులో 2.33ఎకరాలు ఉంది. తన భూమిలో 10 టేకు చెట్లు ఉన్నాయని, వాటిని నరికివేసేందుకు అనుమతి ఇవ్వాలని తహసీల్దార్, అటవీ అధికారులకు ఇటీవల దరఖాస్తు చేశారు. ఆ ఊరులో టీపాన్ లేకున్నా.. దాని సాయంతో సర్వేచేసినట్లు సర్వేయర్ నివేదిక ఇవ్వగా.. క్షేత్రస్థాయి తనిఖీలు లేకుండానే తహసీల్దార్, అటవీ అధికారులు అనుమతులు మంజూరు చేశారు.

అదే గ్రామానికి చెందిన రైతు భాగ్యలక్ష్మికి గ్రామ శివారులోని 377 సర్వే నంబరులో 4 ఎకరాలు ఉంది. తన భూమిలోనే ఆ 10 టేకుచెట్లు ఉన్నాయని, వీటి నరికివేతకు అనుమతులు ఎలా ఇస్తారని అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల నివేదిక ఆధారంగా తాము అనుమతులు మంజూరు చేశామని అటవీ అధికారులు స్పష్టం చేశారు. ఆ వెంటనే భాగ్యలక్ష్మి తన భూ సర్వేకు దరఖాస్తు చేయగా.. మరో సర్వేయర్ సర్వేచేసి నివేదిక రూపొందించారు. అయితే, టీపాన్ లేక రెండు సర్వే నంబర్లలో వ్యత్యాసం వస్తోందని, వీటికి హద్దులేవీ లేవని జిల్లా అధికారులు వివరిస్తున్నారు.

- టీపాన్‌లేక ఇష్టారాజ్యంగా కొలతలు
- రెవెన్యూ అధికారుల నివేదిక ఆధారంగా అనుమతులు
- భూ హద్దులు నిర్ణయించేది తాము కాదంటున్న అటవీ అధికారులు
- ఒకరి భూమిలో మరో భూ యజమాని టేకుచెట్ల నరికివేత
- వివాదాలకు దారితీస్తున్న తీరు



రైతుకు జారీచేసిన పంచనామా కాపీ

జగిత్యాల: జిల్లాలో టేకుచెట్ల నరికివేతకు కొందరు భూ యజమానులు ఒక సర్వే నంబరులో అనుమతి తీసుకుని.. మరోసర్వే నంబరులో తమపని కానిచ్చేస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఆ భూ యజమానుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. అయినా, అధికారులు తగిన రీతిలో స్పందించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దరఖాస్తు తీరు ఇదీ..

- తన భూమిలో టేకుచెట్ల నరికివేత కోసం భూ యజమాని అటవీశాఖ నుంచి అనుమతి తీసుకోవాలి.
- ఇందుకోసం తొలుత మండల సర్వేయర్‌కు దరఖాస్తుచేయాలి.
- ఆయన క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఆ భూమి విస్తీర్ణం, అందులో ఉన్న చెట్లు, హద్దులు తదితర అంశాలపై నివేదిక రూపొందించి దానిని తహసీల్దార్‌కు అందజేస్తారు.
- ఆ నివేదికపై తహసీల్దార్ సంతకం చేశాక.. దానిని జతచేస్తూ భూ యజమాని అటవీశాఖ అధికారులకు దరఖాస్తు చేస్తారు.
- అన్నీ తనిఖీ చేశాక టేకుచెట్ల నరికివేతకు అటవీశాఖ అధికారులు అనుమతి మంజూరు చేస్తారని చెబుతున్నారు.

ఇష్టానుసారంగా అనుమతులు..

- తన భూమిలో టేకు చెట్లు ఉన్నాయని, వాటిని నరికివేసేందుకు అనుమతి ఇవ్వాలని భూ యజమాని దరఖాస్తు చేసుకోగానే అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలు చేయకుండానే అనుమతులు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.
- వాస్తవంగా సర్వేనంబరు పరిధి, టేకుచెట్ల సంఖ్య, అవి దరఖాస్తుదారు భూమిలోనే ఉన్నాయా? అనే అంశాలేవీ తనిఖీ చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.
- కొందరు సర్వేయర్లు ఇష్టానుసారంగా నివేదికలు అందజేయడంతో రెవెన్యూ అధికారులు అనుమతులకు సిఫారసులు చేస్తున్నారని అంటున్నారు.
- జిల్లాల పునర్విభజనలో అనేక గ్రామాల్లో టీపాన్లు తప్పిపోయాయి.
- నక్ష(మ్యాప్) ఆధారంగా సర్వే చేస్తే భూముల హద్దులు వెలుగులోకి వస్తాయని అంటున్నారు.
- అంటే.. టీపాన్ ఉంటే కచ్చితమైన హద్దులు నిర్ణయించవచ్చని భూ కొలతల శాఖ అధికారులు వివరిస్తున్నారు.
- కొందరు సర్వేయర్లు టీపాన్లు లేకున్నా హద్దులు నిర్ణయించి, టీపాన్ సాయంతో కొలిచినట్లు నివేదిక ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఇలాంటి నివేదికలతో దరఖాస్తుదారులే కాకుండా వారి సమీప భూ యజమానులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నివేదిక ఆధారంగానే అనుమతి

చెట్లు నరికివేసేందుకు రెవెన్యూ అధికారులు సర్వే చేశాక మాకు నివేదిక అందజేస్తారు. ఆ రిపోర్టు ఆధారంగానే చెట్ల నరికివేతకు భూ యజమానికి అనుమతి మంజూరు చేస్తాం. అంతేతప్ప ఆ భూములు, వాటి హద్దులు ఎక్కడ ఉన్నాయనే వివరాలు మాకు తెలియదు. జగదేవ్‌పేటలో రెవెన్యూ అధికారుల నివేదిక ఆధారంగానే అనుమతి మంజూరు చేశాం.

– వెంకటేశ్వర్లు, డీఎఫ్‌వో



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్



నివాళి అర్పిస్తున్న జీవన్‌రెడ్డి

వీరవనిత చాకలి ఐలమ్మ

- అదనపు కలెక్టర్ లత, ఎమ్మెల్యే సంజయ్
- ఘనంగా ఐలమ్మ వర్ధంతి

జగిత్యాల: వీరవనిత చాకలి ఐలమ్మ అని అదనపు కలెక్టర్ లత అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లత మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ నుంచి విముక్తి కోసం జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ వీరోచితంగా పోరాడారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు సాయిబాబా, నరేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి

మహిళ లోకానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక చింతకుంట వద్ద ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ, ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు బాలె శంకర్, ఆనందరావు, శంకర్, రాజు పాల్గొన్నారు. కాగా, లింగంపేటకు చెందిన సుమారు 30 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఐలమ్మ స్ఫూర్తి కొనసాగించాలి

జగిత్యాలటౌన్: భూస్వాములపై తిరుగుబాటు చేసిన ధీర వనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు చింతకుంట చెరువు సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హెల్త్‌కార్డులు సద్వినియోగం చేసుకోండి

- మంత్రి కొప్పుల ఈశ్వర్



హెల్త్‌కార్డులు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ప్రైవేట్ సంస్థల్లో చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లకు ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ అందిస్తున్న హెల్త్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో ఆదివారం ట్రస్మా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.., ట్రస్ట్ ఆధ్వర్యంలో 600 మందికి హెల్త్‌కార్డులు అందిస్తున్నామన్నారు. వీటిద్వారా 54 ఆస్పత్రులు బిల్లులో 40శాతం డిస్కౌంట్ వర్తింపజేస్తామని తెలిపారు. మిగతా సొమ్ము సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా కవరవుతాయని వివరించారు. దురదృష్టవశాత్తు మరణిస్తే.. కుటుంబానికి రూ.లక్ష బీమా సౌకర్యం ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ కల్పిస్తుందని వెల్లడవంచారు. ఆటోడ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు, హమాలీలకూ దశలవారీగా హెల్త్ కార్డులు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాయకులు యాదగిరి శేఖర్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, సంగి సత్తమ్మ, చిట్టిబాబు, బత్తిని అరుణ పాల్గొన్నారు.

కొలువు సాధనే లక్ష్యం

- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 20వ తేదీ వరకు గడువు
- ఈసారి కంప్యూటర్ ఆధారిత పరీక్ష

జిల్లాలో భర్తీ చేసే పోస్టులు

స్కూల్ అసిస్టెంట్	50
ఎస్జీటీ	53
లాంగ్వేజ్ పండిట్	37
పీఈటీ	08
మొత్తం	148



విద్యార్థులకు పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తిచేసిన వేలాదిమంది నిరుద్యోగులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ముహూర్తం ఖరారైంది. ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేయడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న తపనతో పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. మరికొందరు శిక్షణ తీసుకునేందుకు కరీంనగర్, హైదరాబాద్‌లోని కోచింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. 2017 సంవత్సరం తర్వాత ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో కొలువు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ఇదీ షెడ్యూల్..

జిల్లాలో 148 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం.. పరీక్ష ఫీజు అమాంతంగా పెంచేసింది. గతంలో రూ.200 ఉండగా.. ఈసారి రూ.1,000 ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించింది ఈనెల 20 నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్(కంప్యూటర్ బేస్డ్) ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల వారీగా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడంతో జిల్లాలోని అభ్యర్థులు కరీంనగర్‌లో పరీక్ష రాయాల్సి ఉంటుంది.

148 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా.. 380 గ్రామాలున్నాయి.
- ఇందులో 511 ప్రభుత్వ ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 187 జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి.
- వీటిలో 3,280 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు.
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల సంఖ్య సుమారు 701 ఉన్నట్లు నివేదికను ఉన్నతాధికారులకు గతంలోనే నివేదించారు.
- కానీ డీఎస్సీలో 148 పోస్టుల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ జారీచేశారు.
- గతేడాది నిర్వహించిన టెట్‌కు ఉమ్మడి జిల్లాలో 32 వేల మంది హాజరయ్యారు.
- ఈనెల 15న నిర్వహించే టెట్‌కు జిల్లా నుంచి సుమారు 10 వేల మంది హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.
- ఈ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగుల సంఖ్య జిల్లా నుంచి సుమారు 20 వేలకు పైగా ఉంటుందని భావిస్తున్నారు.
- మరోవైపు.. పోస్టుల సంఖ్య తక్కువగా ఉందని నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారు.

ఫీజు పెంపు సరికాదు



ఉద్యోగాలు రాక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాం. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఈ తరుణంలో అరకొర పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం శోచనీయం. అంతేకాదు.. పరీక్ష ఫీజు రూ.200 నుంచి రూ.1,000కు పెంచడం దారుణం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడుతోంది. పోస్టులే తక్కువ. ఫీజు భారం మోపడం సరికాదు.

– గాంధారి వెంకటరమణ, నిరుద్యోగి, సిరికొండ

పోస్టులు తక్కువ



డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాకు తక్కువగా పోస్టులు కేటాయించడం బాధాకరం. లాంగ్వేజ్ పండిట్ పోస్టుల సంఖ్య 37గా ఉంటే అందులో తెలుగు పండిట్ పోస్టులు 15 దాటే అవకాశం లేదు. ఆరేళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాం. ఈ తరుణంలో కొన్ని పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరాశకు గురయ్యాం. ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీలు అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించాలి.

– భూమేశ్, లాంగ్వేజ్ పండిట్, చింతకుంట

క్లుప్తంగా

రిటైర్డ్ ఎంఈవో లింగారెడ్డి మృతి


లింగారెడ్డి(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): ఇప్పపెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో సింగిరెడ్డి లింగారెడ్డి(70) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. లింగారెడ్డి కథలాపూర్ ఎంఈవోగా, కథలాపూర్, రుద్రంగి జెడ్పీ హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. ఎంఈవోగా రిటైర్డ్ అయిన తర్వాత.. మండలంలో వృద్ధుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి బలోపేతానికి కృషి చేశారని స్థానికులు పేర్కొన్నారు. లింగారెడ్డి మృతదేహంపై మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. లింగారెడ్డి మృతిపై పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

మృతదేహం లభ్యం

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ కాలువలో ఇటీవల గల్లంతైన వేముల రాజమౌళి మృతదేహం వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట రిజర్వాయర్‌లో లభ్యమైంది. కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన రాజమౌళి ఈనెల 6న వేకువజామున వాకింగ్‌కు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సారెస్పీ కాలువ నీటిని నిలిపివేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం వర్ధన్నపేట రిజర్వాయర్‌లో లభ్యం కావడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట: ఓ మహిళను ఇంట్లోకి చొరబడి, దాడిచేసి, చంపుతామని బెదిరించిన ఘటనలో ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన కనుకుట్ల ఉమ ఇంట్లోకి పట్టణానికి చెందిన పోతుల పాపమ్మ, పసరగొండ సృజన, బీట్ల ప్రభారాణి అకారణంగా చొరబడి ఆమెపై దాడిచేశారు. చంపుతామని బెదిరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ బోల్తా

వీణవంక: మండలంలోని దేశాయిపల్లి శివారు ఐలబాద్‌వద్ద ఇసుక లారీ బోల్తా పడింది. చల్లూరు మానేరు వాగులో ఇసుకలోడ్ చేసుకొని జమ్మికుంట వైపు వెళ్తుండగా.. డ్రైవర్‌హరీఫ్ ఖాన్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ఐలబాద్ వద్ద కుక్కను, అక్కడే ఉన్న మంచినీటి పంపును ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన పురంశెట్టి రవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఆసిఫ్ కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని ప్రగతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. చల్ల రాజేశ్వర్‌రెడ్డి(49) కుటుంబ స్వగ్రామం నేదునూర్ కాగా ప్రగతినగర్‌లోనూ ఇల్లు నిర్మించుకున్నారు. అందరూ ఇక్కడే ఉంటూ అప్పుడప్పుడు నేదునూర్ వెళ్లొస్తున్నారు. రాజేశ్వర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో అతని తల్లిదండ్రులు శనివారం స్వగ్రామం వెళ్లగా ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. అదేరోజు రాత్రి తండ్రితో ఫోన్‌లో మాట్లాడాడు. ఆదివారం ఉదయం తండ్రి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానం వచ్చి, పైఅంతస్తులో అద్దెకు ఉంటున్నవారిని ఇంట్లో చూడమని చెప్పాడు. వారు వెళ్లి ఇంట్లో చూసేసరికి మృతిచెంది కనిపించాడు. అయితే, రాజేశ్వర్‌రెడ్డి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమ్మెబాటలో అంగన్‌వాడీ ఉద్యోగులు

- నేటినుంచి విధులు బహిష్కరిస్తామని అల్టిమేటం

పెగడపల్లి(కోరుట్ల): తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగేందుకు సిద్ధమయ్యారు. తాము సమ్మె చేయబోతున్నామని ఇప్పటికే అధికారులకు వారు నోటీసులు అందజేశారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని వారు విమర్శిస్తున్నారు. సర్కారు తీరుకు నిరసనగా జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేస్తామని వారు హెచ్చరించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

ప్రత్యేక విధానం అమలు చేయాలి..

- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం ఇటీవల కొత్త పాలసీ అమలులోకి తెచ్చింది.
- ఇందులో ఉద్యోగ విరమణ, పింఛన్ అంశాలు చేర్చింది.
- సంక్షేమ పథకాల అమలులో కీలకంగా వ్యవహరించే కార్యకర్తలు, హెల్పర్లకు ఇన్నాళ్లూ నామమాత్రపు ఆర్థిక సాయం అందేది.
- వీరికి ప్రత్యేక విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఇందులో ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లుగా నిర్ణయించింది.
- టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50వేల ఆర్థిక సాయం ప్రకటించింది.
- ఆసరా పింఛన్ అమలు చేయనున్నట్లు పేర్కొంది.
- అయితే ప్రభుత్వం నిర్ణయించిన కొత్త పాలసీ తమకు ఆమోదయోగ్యం కాదని సిబ్బంది పేర్కొంటూ సమ్మెకు సన్నద్ధమయ్యారు.


సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు(ఫైల్)

ఇవే డిమాండ్లు

అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లించాలని, కార్యకర్తలకు రూ.10లక్షలతు, హెల్పర్లకు రూ.5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ చెల్లించాలని, వేతనంలో సగం పింఛన్ చెల్లించాలని కోరారు. 2018 అక్టోబర్‌లో కేంద్రప్రభుత్వం పెంచిన వేతనం, టీచర్లకు రూ.1,500, హెల్పర్లకు రూ.750 ఎరియర్సతో సహా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని, టీచర్లతో సమానంగా వేతనం, 2017 నుంచి టీఏ, డీఏ బకాయిలు మొత్తం చెల్లించాలని, హెల్త్ కార్డులిస్తూ, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈవెంట్స్ నిధులు రూ.250 నుంచి రూ.2వేల వేలకు పెంచాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషన్‌షాపు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు చెల్లించాలని, వేసవిలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా సెలవులు వర్తింపజేయాలని, జీవో నంబరు 14, 19, 8ని వెంటనే సవరించాలని, ఐదేళ్లలోపు పిల్లలను చేర్చుకోవద్దని ప్రైవేట్ పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేయాలని, ఆసరా, కల్యాణలక్ష్మి తదితర పథకాలు అమలు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో నాలుగు ప్రాజెక్టులు..

జిల్లావ్యాప్తంగా మల్యాల, ధర్మపురి, మెట్‌పల్లి, జగిత్యాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి.

- ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు 1,065 మంది విధులు నిర్వహిస్తున్నారు.
- తెలంగాణ ఏర్పాటయ్యాక డిమాండ్ల సాధన కోసం సిబ్బంది అనేకమార్లు సమ్మెచేశారు.
- సీఎం కేసీఆర్ స్పందించి వారిని ప్రగతి భవన్‌కు పిలిచి సమస్యల పరిష్కారానికి హామీచ్చారు.
- ప్రగతి భవన్‌లో కేసీఆర్ అంగన్‌వాడీ వర్కర్స్ అనే పదాన్ని తొలగించి అంగన్‌వాడి టీచర్స్‌గా మార్పు చేశారు.
- పేరు మార్చడంతో తమ జీవితాలు మారిపోతాయని భావించారు.
- కానీ కేసీఆర్ ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.
- దీంతో గత మార్చిలో సమ్మెకు చేశారు. అయినా సమస్యలు పరిష్కారం కాలేదు. మరోసారి సమ్మెకు దిగుతున్నారు.

'సమ్మెలో పాల్గొనడంలేదు'

సారంగాపూర్(జగిత్యాల): తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్‌వాడీ టీచర్లు సమ్మెలో పాల్గొనడం లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్య జల తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మినీఅంగన్‌వాడీ టీచర్లను బేషరతుగా ప్రధాన అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో జీవో విడుదల అవుతుందని చెప్పారు. దీంతో తాము ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటారని ఆమె వివరించారు.

హామీలు నెరవేర్చాలి



మా సమస్యల పరిష్కార కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి. వీఆర్‌వో, వీఆర్‌ఏల మాదిరిగా మమ్మల్ని పర్మినెంట్ చేయాలి. – రజిత, జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీల యూనియన్

కొత్తపాలసీ వద్దు



మాకోసం ప్రభుత్వం ఇటీవల తెచ్చిన కొత్త పాలసీ మాకు ఆమోదయోగ్యం కాదు. మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి. ప్రతినెలా రూ.26 వేల వేతనం ఇవ్వాలి. మాపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు. – జయప్రద, మండల అధ్యక్షురాలు, అంగన్‌వాడీల యూనియన్

పోరాటం ఉధృతం



అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహర్తిస్తోంది. అనేకమార్లు ఆందోళనలు చేసినా సమస్యలు పరిష్కరించడం లేదు. వాటిని పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తాం. – ఎంప చౌదరి, సీఐటీయూ జిల్లా కన్వీనర్

కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు న్యాయం

- మేడిపల్లి సత్యంను ఎమ్మెల్యేగా గెలిపించండి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ఆదివారం బలవ్వంతాపూర్ అనుబంధ కాశీనగర్ నుంచి గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బల్వంతాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో స్థానిక పెరిక సంఘం సభ్యులు, మహిళలు, యువకులు సుమారు 300మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా, జీవన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్నివర్గాలు దగాకు గురయ్యారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే బల్వంతాపూర్‌- నర్సింగాపూర్ మధ్య తారురోడ్డు నిర్మిస్తామని, రైతులతోపాటు రైతుకూలీలకు రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఓడినా ప్రజల మధ్యే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. నాయకులు షేర్ల పద్మ, తాటిపర్తి విజయలక్ష్మి వీరబత్తిని శోభారాణి, దారం ఆదిరెడ్డి, దొంగ ఆనంద రెడ్డి, శనిగరపు తిరుపతి, మారంపల్లి గంగాధర్, బత్తిని శ్రీనివాస్, సతీశ్‌రెడ్డి, కటుకం వినయ్, లక్ష్మణ్, నర్సింహారెడ్డి, మరాటి లక్ష్మీనారాయణ, కోను లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న బల్వంతాపూర్ గ్రామస్తులు

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి అభినందన

కాగా, ఈనెల 5న వరదకాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన నూకపల్లిలోని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభినందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతోపాటు మానసిక్టైర్యం నింపడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

రాయికల్(జగిత్యాల): సింగిల్‌విండో మాజీ చైర్మన్ పడిగెల రవీందర్‌రెడ్డి తల్లి ఆదివారం మృతిచెందారు. దీంతో రవీందర్‌రెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రవీందర్‌రావు, మండ రమేశ్, మధు ఉన్నారు.

గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయండి

- రూ.500 కోట్లు కేటాయించండి
- సీఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.500కోట్లతో గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక భరతమాత కూడలి వద్ద గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవి, బాధిత కుటుంబాలతో కలిసి ఆయన వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉన్నఊరులో పనులు లేక యువత ఉపాధి కోసం ఎడారి దేశాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. పరాయిదేశంలో అనారోగ్యం, పనిఒత్తిడి, రోడ్డు ప్రమాదాలు, వేతన బాధలు వంటి సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇంకొందరు వివిధ కారణాలతో చనిపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారి కుటుంబాల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గల్ఫ్ జెఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిల్ల రవిగౌడ్ మాట్లాడుతు కార్మికుల వెతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి వారిని ఏకం చేసేతందుకు ఆగస్టు 12న ప్రారంభమైన గల్ఫ్ భరోసా దీక్ష ఉద్యమం నవంబర్ 19 వరకు సాగుతుందని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలతో పాటు రాజకీయ పక్షాలు స్పందించకుంటే గల్ఫ్ కార్మిక కుటుంబాలతో రాజకీయ వేదిక ఏర్పాటు చేసి శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, డైరెక్టర్ న్యావనంది లింబారెడ్డి, గల్ఫ్ కార్మికులు, మృతుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


ప్రతిభ ప్రతిబింబించేలా..

- విద్యార్థుల విజ్ఞానానికి చక్కని వేదిక మంథన్
- ఈనెల 15 దరఖాస్తులకు చివరి తేదీ

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై ఆసక్తి కలిగించడం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో భారతీయుల కృషి తెలియజేసే ఉద్దేశమే విద్యార్థి విజ్ఞాన్ మంథన్. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభ పరీక్ష నిర్వహిస్తోంది.

పరిశోధన సంస్థల సందర్శన

- పలు జాతీయ ప్రయోగశాలల సందర్శనతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందుకునే అరుదైన అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తోంది.
- ఇందులో డీఆర్డీవో, బార్క్, సీఎస్ఐఆర్ వంటి ప్రఖ్యాత పరిశోధన సంస్థలున్నాయి. వాటిని సందర్శించే అవకాశంతో పాటు మూడు వారాలు ఇంటర్న్‌షిప్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహిస్తోంది.
- ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆ ప్రయోగశాలల సందర్శనతో కొత్త స్ఫూర్తి పొందే అవకాశముంది. 2024 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి పరీక్ష మే 18, 19న నిర్వహించనున్నారు.
- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 6 నుంచి 11వ తరగతి (ఇంటర్ ప్రథమ సంవత్సరం) విద్యార్థులకు ఆన్‌లైన్ వేదికగా ఈ పరీక్ష నిర్వహిస్తారు.
- 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్లుగా, 9 నుంచి 11 వరకు సీనియర్లుగా పరిగణిస్తారు. ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, రాష్ట్ర బోర్డు విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు.



వీవీఎం లోగో

ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష..

అక్టోబరు 1న నమూనా పరీక్ష ఉంటుంది. అదే నెల 29 లేదా 30న జిల్లాస్థాయిలో పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. సీనియర్, జూనియర్ విభాగంలో 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్ర పాఠ్య పుస్తకాల నుంచి 50 శాతం, విజ్ఞానశాస్త్రం రంగంలో దేశ కృషిపై 20 శాతం, లాజిక్ రీజనింగ్‌కు 10 శాతం, శాస్త్రవేత్త బీర్బల్ సహానీ జీవిత చరిత్రకు 20 శాతం బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి.

జిల్లాస్థాయిలో ఇలా..

జిల్లాలో ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రతి తరగతిలో ప్రతిభచూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు.

రాష్ట్రస్థాయిలో..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభచూపిన మొదటి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి మొత్తం 120 మందిని రాష్ట్రస్థాయికి పంపుతారు. అత్యంత ప్రతిభకనబర్చిన 18 మందిని రాష్ట్రస్థాయి విజేతగా ప్రకటిస్తారు. వారిలో మొదటి ముగ్గురికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలిస్తారు.

జాతీయ స్థాయిలో..

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చినవారి నుంచి 18 మందిని జాతీయ స్థాయి ప్రతిభావంతులుగా గుర్తిస్తారు. వీరిని హిమాలయన్స్ అంటారు. వారికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. వీటితో పాటు నెలకు రూ.2 వేల చొప్పున ఏడాది పాటు ఉపకారవేతనం అందిస్తారు.

దరఖాస్తు ఇలా..

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పోటీలు పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహిస్తారు. www. vvm. org. in వెబ్‌సైట్‌లో రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 1న నమూనా పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఆంగ్లం విభాగాల్లో పరీక్ష ఉంటుంది.

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల విజ్ఞానానికి మంచి అవకాశం. పరీక్షను విద్యార్థులు వ్యక్తిగతంగా, పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సైన్స్ ప్రయోగాలకు బీజం పాఠశాల స్థాయి నుంచే కలగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా దీన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, అభిరుచి కలిగించడం, వారిలోని నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీయడం ఈ పరీక్ష ఉద్దేశం. వీవీఎం పరీక్షలో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. – బి.రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి, పెద్దపల్లి

జీవితం కవిత్వానికి కొలమానం

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి


సన్మానిస్తున్న సిధారెడ్డి తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కవిత్వానికి జీవితమే కొలమానం అని, తెలంగాణ నేల కొత్తశక్తిని అందిస్తుందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన కాళోజీ పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవిత్వానికి రూపం, శిల్పం అలంకారాలు మాత్రమేనని రమ్యం కాదని, సామాన్య మానవుడిని ఒప్పించేది మాత్రమే కవిత్వంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవిత్వానికి కులాలు, మతాలతో సంబంధమే లేదన్నారు. మంచి కవిత్వం పది కాలాల పాటు నిలిచిపోతుందని వివరించారు. ప్రైజ్ మనీతో సంబంధం లేకుండా హృదయంతో ఇచ్చే పురస్కారం ప్రోత్సాహాన్ని అందిస్తుందని, అదే కాళోజీ నారాయణరావు పేరిట అందించే ఈ పురస్కారమని వెల్లడించారు. కవులకు పురస్కారాలు ప్రేరకాలుగా ఉంటాయన్నారు. అనంతరం ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములుకు 2023వ సంవత్సరానికిగాను కాళోజీ పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, రూ.2వేల నగదు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, గంద్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, వేణు, కేఎస్ అనంతాచార్య, గుర్రాల మాధవ్, బొమ్మకంటి కిషన్, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, గులాబీల మల్లారెడ్డి, చిందం సునీత, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేత అరెస్ట్

వేములవాడరూరల్: గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. కోనరావుపేట మండలం వట్టిమల్లకు చెందిన డొక్క నారాయణ వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామ శివారులో గుడుంబా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఆదివారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి 33 గుడుంబా ప్యాకెట్లు, దాదాపు 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ లక్‌పతి, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుళ్లు అరీఫ్, శంకర్, సతీష్, శ్రీనివాస్, రాజశేఖర్ ఉన్నారు.


పోలీసుల అదుపులో గుండుంబా విక్రేత

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గండిలచ్చపేటకు చెందిన బొమ్మెన సమ్మయ్య ట్రాలీ ఆటలో 5 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. బియ్యం, ట్రాలీ ఆటోను స్టేషన్‌కు తరలించి, సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


పట్టుబడిన బియ్యం

కార్యకర్తలే ప్రధాని మోదీకి బలం

- బీజేపీ పార్లమెంటరీస్థాయి ఐటీసెల్ సభ్యుడు శేఖర్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): గ్రామాలు, పట్టణాల్లోని బూత్ స్థాయి కార్యకర్తలే ప్రధాని నరేంద్రమోదీకి బలమని బీజేపీ ఐటీసెల్ పార్లమెంట్ కమిటీ సభ్యుడు ఇట్టెడి శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల కృషితోనే కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ వ్యవస్థను నాశనం చేస్తున్నాయని విమర్శించారు. రైతుబంధు సర్వరోగ నివారిణిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించుకుంటుందని, రైతులు తమ పంట ఉత్పత్తులు అమ్ముకోవడానికి, కనీస మద్దతు ధరలు పొందడానికి రైతులు ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందనని పేర్కొన్నారు. ధరణితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, తాగు, సాగునీటి ప్రాజెక్టులతో పేరిట బీఆర్‌ఎస్ నేతలు అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేయాల్సిన బాధ్యత ఐటీ సెల్ నాయకులపై ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ముద్దం సత్యనారాయణగౌడ్, బైన ప్రశాంత్, దండుగుల అంజిరాజ్, లవంగ శివకుమార్, ప్రవీణ్, మధు, దివాకర్, నత్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

బీజేపీ టికెట్ల కోసం దరఖాస్తులు

జగిత్యాలటౌన్: జగిత్యాల అసెంబ్లీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా తనకు పోటీచేసే అవకాశం కల్పించాలని కోరుతూ ఆ పార్టీ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న తనకు అవకాశం కల్పించాలన్నారు. కౌన్సిలర్ గుర్రం రాము, నాయకులు ఏసీఎస్ రాజు, అరవ లక్ష్మి, బుర్ర ప్రమోద్, కిశోర్‌సింగ్, జ్ఞానేశ్వర్,సంతోష్, అరుణ్, బిట్టూ తదితరులు ఉన్నారు.

కోరుట్ల నుంచి..

మెట్‌పల్లిరూరల్: కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని వేంపేట మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు మారంపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడి నుంచి టికెట్ తనకు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గతంలో రెండుసార్లు మెట్‌పల్లి బీజేపీ అధ్యక్షుడిగా,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, నిజామాబాద్ పార్లమెంట్ కో–కన్వీనర్‌గా సేవలు అందించానని గుర్తుచేశారు.


దరఖాస్తు దాఖలు చేస్తున్న రవీందర్‌రెడ్డి

సారంగాపూర్ నుంచి..

సారంగాపూర్(జగిత్యాల)/ధర్మపురి: జగిత్యాల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని నర్సింహులపల్లెకు చెందిన బీజేపీ నాయకుడు సబ్బ రాజేందర్ కోరారు. ఈమేరకు తన అనుయాయులతో కలిసి హైదరాబాద్‌లో దరఖాస్తు చేశారు. బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన నారపాక అశోక్ ధర్మపురి ఎస్సీ నియోజకవర్గం నుంచి తనకు పోటీచేసే అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అశోక్ బీజేపీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్‌కు అత్యంత సన్నిహితుడు.